"క్రిస్మస్ వేడుకలు"

కొమర్రాజు వినాయకరావుగారు

౧

ఎళుంబూరులో వున్న "కలవల కన్నన్ చెట్టి" గారి సత్రం, చెన్నపట్నానికొచ్చే పొరుగూరిజనములలో చాలమందికి ఆశ్రయ మివ్వడానికి చాలేటంత విశాలంగా నిర్మితమై యుండటంవల్ల, మద్రాసులో చాలా పేరుమ్రోగిన సత్రమనే చెప్పవచ్చు! అందులో "క్రిస్మస్" సెలవులు; 'పార్కుఫయర్'; నాటకాలు, సర్కసులు, బయస్కోపులు, యింకా ఏవేవో చెప్పరానన్ని చిల్లరవినోదాలతోను వేడుకలతోను వెర్రెత్తిపొయ్యేరోజులు కూడా నివి! ఎక్కడెక్కడి జనం యీవేడుకల్ని చూద్దామనే ఉబలాటంతో వొచ్చి పడతా రీవారంరోజులూ. అస్సలే ఆరులక్షులజనసంఖ్యతో తహతహలాడుతున్న చెన్నపట్నం, యీవారంరోజులూ ఎక్కడెక్కడి జనం వొచ్చిపడటంవల్ల మరింత 'గడబిడ'తో నిండి 'గజిబిజి'గా నుండ ఆరంభించింది. అందులో తెలుగుదేశస్థులకు యిక లెక్క లేదు! సత్రమంతా తెనుగుమయం! తెనుగురాజ్యం! కమ్మ, వెలమ, రెడ్డి, కోమటి మొదలైన అనేకకులస్థులతో కిటకిటలాడుతోంది సత్రం.

సత్రంలో ఒకచిన్న టిక్కీలో కమ్మ సూరమ్మ, కమ్మ ఈరయ్యా చాపమీద కూర్చుని కులాసాగా ప్రసంగిస్తున్నా రేమిటో.

"నాయుడుగారు బలే మంచిమనిసల్లే ఉన్నాడు బావా!"

"దేముడుమల్లే మనకు ప్రాప్తమయ్యాడే—నిజంగా! అతనికడుపు చల్లగాను! 'సత్రం మేనేజరు'తో ఇంగిలీసు మాట్లాడి పదిహేనురోజులదాకా యీ 'టిక్కీ' నిప్పించాడు."

"అస్సలు మూడురోజులక్కంటే ఉంటానికీడ వీల్లేదంటగా?"

"ఔనే పిల్లా! నేను సెప్పిం దేమిటే? రామయ్యనాయుడు 'సిఫారస్' చేసి ఇప్పించాడు కొట్టు. డాక్టర్ దొరతో కబుర్లు చెప్పి ఆదొర్నొ బుట్టలో వేసుకొన్నాడు; బుట్టలో వేసుకొన్నాడు కాబట్టే అంత దబ్బున్నే మీ అత్తమ్మను 'కన్నాసుపత్రి'లో చేర్చుకున్నారు! దేముడిమల్లే ప్రాప్తమయ్యేడు పాపం!"

"సర్లే కాని బావా! ఏడుకలెప్పుడూ నూడటం? వొచ్చి అప్పుడే అయిదారురోజు లయింపన్నమాటే—! అత్తమ్మకు బువ్వ తీసుకపోవడంలో తెల్లారుతోంది బతుకు!"

"ఎందుకో యింత కోపం? పిల్లా! తీసుకెళ్తానుగా—ఓపికపట్టలే వింకొంచెం?"

"ఇదంతా తెలుస్తే వొచ్చేదాన్నే కాదు; ముమ్మాటికి! ఏదో 'సంబరాలు' చూద్దామనేనా వొచ్చింది? కొట్లో యీడ మురుగుదామంటూనా?"

"చాల్లే పిల్లా! అట్టే కోబ్బడకు!" అన్నాడు, ముప్పయిఅయిదేండ్ల ఈరయ్యా, సూరమ్మ పాలబుగ్గల ఒకటిరెండుసార్లు నవ్వుతూ పట్టి పిండి.

"చాలు బావా! మోటసర్సా" లన్నది భార్య సూరమ్మ కస్సున, కెంపుబారి కొద్దిగా ఉబికిన బుగ్గల్ని చేత్తో తడుముకుంటూ. అంతట్లోకే యెవ్వరో యింకో మనిషి అకొట్టుద్వారందగ్గిర నిల్చుని మహా పరిచయం ఉన్నవాడిలాగా పలకరించా డాదంపతుల్ని.

"ఓహో తమరా! కూకోండి బాబూ!" అన్నాడు ఈరయ్య; ఓమాటు కన్నెత్తింది సూరమ్మ; ఆచూపులో ఆశ్చర్యం, భయం, సంశయం, అమాయికత్వం, అన్నీ యిమిడిఉన్నాయి; 'నిజంగా నాయుడుగారు నవమన్మథు డబ్బా!' అన్నాయా అన్నట్టనిపించినై సూరమ్మకండ్లలోని తళతళలూ, మిలమిలలూ! రామయ్యనాయు డొక్కచిరునవ్వుతో చతికిలబడ్డాడు

రామయ్యనాయుడటు అరవ్వాడూ కాదు, యిటు తెనుగువాడూ కాదు! నాయుడుగారికి అరవం బాగా తెలుసు; తెలుగూ తెలుసు! ఐతే మొత్తంమీద తెనుగులక్షణాలు తక్కువ; ముప్పాతికమువ్వీసం అరవ లక్షణాలే ఉట్టిపడుతున్నాయి, నాయుడుమొహం, జుట్టూ, బొట్టూ, కట్టూబట్టి చూస్తే! సన్నని పాల 'గ్లాస్గో'మల్లు గూడకట్టుక్రింద చుట్టుకున్నాడు; నీలపు 'సర్జి'కోటు తొడుక్కున్నాడు. తల కిరువైపులా గొఱ్ఱెపొట్టేళ్ల కొమ్ములమల్లే క్రాపు రెండు పాయలుగా చీలింది. తీర్చినట్టూ ముక్కు; ఎప్పుడు నవ్వుతూన్న కండ్లు; చక్కని అంతగా ముదరని మొహం; చేతులో బుల్లి బంగారు 'రిస్టు'వాచి! నోట్లో యేవేళా సిగరేటూ! మొత్తంమీద నవమన్మథుని అవతారం మల్లే కనిపించాడు రామయ్యనాయుడు, సూరమ్మకళ్లల్లో! కళ్లు వాల్చింది; తల వంచుకుంది సూరమ్మ.

"పార్కువేడిక్కై యెప్పుడుదా సూడబోతారుదా?"

"ఔను, నాయుడుగారూ! మాకూ చూడాలంటూనే ఉంది; ఐతే అమ్మకోసం మనసులో వొకే సీకులాట!"

"అడే! ఎందుకుదా భయందా? బెద్దడాక్టర్‌తో నేద్దా సెప్తినే? పైత్యకారుగా ఉండావే!"

"ఎబ్బెబ్బే! అది గాదండీ నాయుడుగారూ! తమరిసాయ్యం మరుస్తామా — ఋణాన్నిబోమూ మరుస్తే! అట్టాగే పోదాం! సూరమ్మకూ సూపించాల్లెండి; ఊరుకోదు సూపియ్యకపోతే. ఏమంటావే పిల్లా? సాయంకాలంగా పోదాం" అని ముగించాడు ఈరయ్య, పెండ్లికూతురికిమల్లే సిగ్గులు చిందుతూన్న సూరమ్మ వదన బింబానికేసి మాస్తు. సూరమ్మ మారు మాట్టాల్లే; మూతి బిగించి శిరస్సాంచింది.

"నాకు వేళైవుంది; పోవాలా! ఈదినం నాల్గుగంటకి వేడిక్కై సూడ పూడుస్తా" మంటూ నాయుడు చాపమీదనుంచి లేచి నిల్చుని గడపదాకా వెళ్లి, ఏదో అడిగేందుకు మరిచిపోయినవాడిలాగా చివాలున మళ్లీ తిరిగి — "ఈరయ్యగారో! అర్జంటుగా నాకుదా అరవై రూపాయి అవసరం. ఉండాదా? రేపుదా యిస్తాన్దా" నంటూ చిటికేశాడు.

"చిత్తం! అట్టాగే లెండి! అంతకంటేనా!" అంటూ ఈరయ్య పెట్టెలో వున్న నోట్లకట్ట విప్పి ఆరునోట్లు లెక్కపెట్టి నాయుడుచేతుల్లో పెట్టాడు.

"సెబా"స్సంటూ నాయుడు సగర్వంగా పేము బెత్తం గిరగిరా తిప్పుకుంటూ చక్కాపొయ్యాడు, ఓమాటుమాత్రం భుజంమీదికి తల తిప్పి సూరమ్మకేసి చూశి. సూరమ్మ చకాచకా వెళ్లిపోతోన్న నాయుడు గారివేపోకమారు మాత్రం చూపు పరపింది; అమాయికత్వంలో భయమూ, ఆశ్చర్యమూ సమ్మిళితమయి ఉన్నాయి, ఆ మాపు తళతళలో!

౨

మధ్యాహ్న మొంటిగంటకు ప్రారంభించిన పందేలింకా సాయంత్రం నాలుగున్నరకైనా ముగియక జయప్రదంగా సాగుతునే ఉన్నాయి! గుఱ్ఱాల పోటీలు వొంటిగంటన్నరకల్లా అయిపోయినై; వొంటెద్దుబండ్ల పోటీ, సైకిళ్ల పందెం, కత్తుల సామూ, నాల్గుమైళ్ల రన్నింగ్‌రేసూ, మొదలైన పోటీలింకేవో అప్పటికే జరిగినై. 'శేఖ్‌లా' రేసు ప్రస్తుతం జరుగుతోంది పెద్ద సున్నలాంటి గుండ్రటి మైదానం చుట్టూ కిటకిటలాడిపోతూన్నారు జనం! అవ్వాళ "గవర్నరుగారి రోజు" అవడంవల్ల మరింత తోపిడి, అలజడీ, అల్లరీను! ఆ మనుష్యుల గుంపులలో ఒకచోట కట్టగట్టుకుని సూరమ్మా ఈరయ్యా చూస్తూన్నా రాశ్చర్యం కనపరుస్తూ. పందెముపైన అంతగా మోజు కనబరచడం లేదంటూ స్పష్టంగా తెలుపుతోంది ఈరయ్య పక్కనే కూర్చున్న నాయుడుగారి ప్రవర్తన. మహాశ్చర్యంతో, వట్టి అమాయికత్వం కురుస్తూ ఉన్న ఆనందంతో కలిసిమెలిసి కట్టగట్టుకుని ప్రజలందరితోబాటు తామూ 'శేఖ్లా' రేసుమీదే దృష్టి యావత్తూ నిల్పిన యీ తెనుగుదంపతు లిద్దరినీ, మధ్యమధ్య తేరిపార

జూస్తూ వేళాకోళంగా పెదవులు మెలివేసుకుంటూ, "కానివ్వం డికెంతసేపులే!" అన్నట్టు మందహాసం చేస్తూ, తనలో తానేమో ఆలోచిస్తున్నాడు నాయుడుగారు! మంచి యౌవనపటుత్వంలో ఉన్న యిరువై యేళ్ల సూరమ్మ ముఖారవిందం ఒకే గుటకలో మింగేసే వాటిమల్లే మెరిసేవి నాయుడిగుడ్లు రెండూను, ఆమె మీది కాతడు చూపు బరపినపుడల్లా! ఆవీక్షలో యేదో కాముకవికారం స్ఫురిస్తోంది; ఆమందహాసం — అమృతముఖగరళభాండాన్ని తలపుకు తెస్తోంది; మొత్తంమీద నాయుడుగారి అప్పటి పరధ్యానమూ, బొమముడుపులూ, పెదిమలమెలికలూ, విస్మయసంచలిత వీక్షలూ — యివన్నికూడా యేవో ఉత్పాతాలమల్లే ప్రేక్షకులకు స్ఫురించే తీరుతవి!

"ఆస్సి! ఆడికడుపు చల్లగాను! ఎంతతొరగా తోల్తున్నాడో బావా!"

"నిజం పిల్లా! ఏంసిత్రం?"

"దోసపాళ్లో యిట్టాటిసిత్రం ఓర్రోజైనా చూశాం? అరెరెరే! వెనకనోడు ముందరివోణ్ణి దాటి బలేగా వొస్తున్నాడే!"

"అరెరెరే!"

"బావోయ్! బావోయ్! ఆడ — దూరాన జరీ పందిట్లో కూకున్న దొరాదొర్సా నెవ్వాళ్లో? చెప్పే?"

"నాకేం తెల్సే పిల్లా! ఐనా రామయ్యనాయుడుగార్నడుగుదాం; తెలిసినోడు"—"నాయుడుగారూ!" అనేపిలుపు విసిరేశాడు ఈరయ్య, పరధ్యాన్నంగా ఉన్న నాయుడుగా రులికిపడేటట్టు! నాయుడొక తియ్యనినవ్వు రువ్వాడు ప్రత్యుత్తరంగా.

"ఓ — ఆడ పందట్లో కుర్చీలోనున్న ఆ — దొరాదొర్సా నెవ్వరండీ?"

"సెభాస్! ఏమిదా మీకు తెలుసుదా? ఆ దొరై గవర్నర్, దొర్సాని గవర్నర్ భారియదా!" అన్నాడు నాయుడు దబాయించి సగర్వంగా.

"ఆర్ని! అట్టాగా! చూశావే పిల్లా?"

"ఆస్సి, గొ—వో—ర్నరా!" అంది సూరమ్మ నోరు కాస్తా తెరుచుకుని ఆశ్చర్యాచేతనావస్థలో. నాయుడుగారి కండ్ల మెరుములు తనశరీరంలో ఉరిమినట్టయింది సూరమ్మకు! బెదరిన జింకమల్లే మొహం తిప్పేసుకుం దింకోవేపుకి.

* * * * *

చీకటి పడింది; అంతా విద్యుద్దీప తేజోమయంగా మారింది! మైదానంలో పందార్యాలు చూసిన యావత్తు ప్రజా చెదరి చిందరవందరయింది; తుపానుపట్టిన గభీర సాగరంలా అక్కడికక్కడికి తోసుకుని వస్తూం పోతూన్నారు జనం! ఆ విద్యుద్దీప తేజంలో 'తళతళా', 'పెళపెళా' మెరసిపోతున్నాయి స్త్రీలవజ్రహారాలు, వజ్రపుకమ్మలు, బంగారపు వడ్డాణాలు, గాజులు, జరీచీరెలూ, చక్కని శరీరచ్ఛాయలూ, తదితరవేషాలంకృతులూనూ! యౌవన ప్రేమికు లెందరెందరో చేతులుకలుపుకుని, అన్యోన్యాలాపనానిమగ్నులౌతూ ఆయనర్ఘళానేక రుచిరాంబరవర్ణ కల్లోలినీతరంగమాలాజాలంలో లీనమైపోతున్నారు!

* * * * *

ఒక గుడారంముందర బ్యాండు వాయిస్తున్నారు. గుడారంలోనుంచి జనం వస్తూ పోతూ ఉన్నారు. సూరమ్మ పట్టుదలమీద ఈరయ్య పావలా టిక్కెట్లు మూడుచ్చుకున్నాడు; ఏదో చూద్దామనే అపేక్షతో సూరమ్మ 'గబగబా' గుడారములో కురికింది!

లోప లేమీ లేవు చూడబోతే! ఉత్తి అద్దాలమయం డేరా లోపలిభాగమంతానూ! "ఆ-సింతేనా?" అనుకుని చిన్నబుచ్చుకున్న తనవదన మొకదఫా పొడుగాటి అద్దంలో చూసుకుంది; సూరమ్మకు పట్టలేనంత నవ్వొచ్చింది; తానాఅద్దంలో ఒంటెలా సాగిపోతున్నది వికారంగా! ఈరయ్య వెడల్పాంటి వలయాకారదర్పణంలో చూసుకుంటూ పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వుకుంటున్నాడు; "పిల్లా! పిల్లా! ఈడకి రా! చూసుకుందాం మనిద్దరి అందం" అని పిలిచాడు పట్టరాని నవ్వుతో ఊగిసలాడుతోన్న కంఠస్వరంతో; సూరమ్మ

రివ్వున బావను చేరుకుంది. ఇక నవ్వుకు అంతమే లేదు! వొక్కటే నవ్వడం! — ముసిముసినవ్వులూ, పకపక నవ్వులూ — పొట్ట లుబ్బి పొయ్యేటట్టు!

"ఒసే! పిల్లా! ఎంచక్కా ఉన్నావో? గాబులా బలిసి — పక్కలు తన్ని!"

"బావోయ్! మాబాగా వున్నావ్లే! గుండ్రాయిమల్లె, దున్నపోతల్లె — పొట్టా, మొహం, ముక్కూ, చెవ్వూ వాచిపోయి!"

పైవిధంగా ఈరయ్యా సూరమ్మా అన్నిఅద్దాల ముందు నుంచుని చూసుకుంటున్నారు తమవికారాకారాల్ని — విసుకు విరామం లేకుండా! అదేమిటో చిత్రం? నాయుడుగారుమాత్ర మంత ఉదారంగా, ఆపల్లెదంపతులతో బాటు నవ్వులదానం చేసుకోలే! కొంచెం విసుకుతోనూ, అలక్ష్యంతోనూ, "సర్దా! పూడుస్తాం రా! తమాషా శానా చూడవాలా. కన్నాడిలత్తై సారి చూస్తిని"అన్నాడు నాయుడుగారు ఈరయ్యనుద్దేశించి.

* * * * *

రాత్రి తొమ్మిదిన్నరయినది; పదిగంటలనుంచి పన్నెండున్నరవరకు ఆరోజున "ఫయర్ వర్కు" ల ప్రదర్శనం; బాణసంచాలు కాలేటందుకు సిద్ధపడుతున్నాయి. నాయుడుగారి కడుపు చల్లగాను! సూరమ్మకూ, ఈరయ్యకూ ఎనిమిదిగంటలకల్లా తోటలోనే ఉన్న "కోమలవిలాసం" లో తృప్తికరంగా వేడివేడి నాజూకుఫలహారా లిప్పించాడు, కాఫీ బోయించాడు; తానూ తాగాడు రెండుకప్పుల "స్పెషల్" కాఫీ; చివరకు 'బిల్లు' మూడురూపాయలైనా ఏమాత్రం గొణుగుడు గాని, సణుగుడు గాని లేకుండా హోటలయ్యారి చేతిలో నిర్లక్ష్యంతో పదిరూపాయలనోటు గిరాటేశాడు.

తరువాతికర్చంతా నాయుడిదే! బలవంతాన అన్నితమాషాలకూ తానే యిచ్చాడు! మునుపటిమల్లే పరధ్యానంగా లే డిప్పుడు; కండ్లు నవ్వుతున్నై; నోరు నవ్వుతోంది; ముఖాన కళ హెచ్చింది; కాలుస్తున్న 'సిగరె' ట్టిన్నని చెప్పడానికి వీల్లేదు. అబ్బా! యీమారు పెల్లా వొచ్చిందో? ఎందు కొచ్చిందో?

* * * * *

సూరమ్మ కింకా పిల్లచేష్టలు పూర్తిగా పోలేదు. బొత్తిగా పెద్ద నాబసానీ కాలేదు! మధ్యావస్థలో కొట్టుకలాడుతూం దింకాను. పట్టణవాస అనుభవం లేదన్న మాటే గాని, సాధారణంగా పల్లెటూరిపిల్ల లెరుగని, నవనాగరికతక్రింద గణింపబడుతున్న — నవనాగరికం అస్సలిది కానే కాదు!— ఫేస్ పౌడర్లు, ప్యారిస్ సబ్బులు, ఆటో దిల్ బహార్లు, కేశరంజనీ నూనెలు, తలపిన్నులు, లోలక్కులు, చీ-కా-కు-గాజులూ — యీ సామగ్రి ప్రయోగంలో సూరమ్మ ఆరితేరింది! చంకలమట్టుకున్న 'V' కత్తిరింపు జ్యాకెట్టు తొడుక్కుంటె, క్రిక్కిరిసి ఉబ్బుగా ఉన్న దోరరొమ్ము సగం కనబడేటట్టు! తళతళా మెరిసే పట్టుచీర; రెండు జతల 'S' గాజులు; మెళ్లో బంగారంగొలుసు నాజూగ్గా! చెవులకి లోలక్కులు; యిరవై సూదులతో పొడిచిన యెత్తయిన జుత్తుముడి; మొహమంతా పాతిక అంగుళం దట్టంగా మెత్తిన తెల్లనిపౌడి; నడుముకు పాములాంటి వడ్డాణమూ! నాయుడుగా రిలాంటి పిల్లదానిమీద కన్నేశారంటే అదొక ఆశ్చర్యంలో చేరినసంగతి కాదు. ఆరాత్రి సూరమ్మ తమాషాలలో వొళ్లే మరిచింది; చీనాపాటలు పాడుతూ విద్యుచ్ఛక్తివల్ల నడిచే 'రంకులరాట' మెక్కింది; గిరగిరా, గిరగిరా, తిరిగింది తల తిరిగేదాకా! "ఏరోప్లేను" చక్రంలో కొంతసేపు గడిపింది; పెంకిపట్టు పట్టి సర్కసు కాస్తా చూడగలిగింది! లాటరీ అంగళ్లలో పావుగంటవరకు జూదమాడింది. అంతా కొత్తే! అంతా వింతే! పాపం! ఇంకా యేవేవో మాద్దామనే ఉబలాట! ఎల్లాగైతేనేం, బలవంతంమీద భార్యతో బయటబడేలోపల ఈరయ్యకు తలప్రాణం తోకకొచ్చింది. "ఊ! ఊ! ఊ!" అంటూ తన అప్రియాన్నీ, అసమ్మతినీ, తెలుపక పోలేదు సూరమ్మ మొగుడితో.

* * * * *

బాణసంచా వేడుకలు విజృంభించాయి ! 'ఢమ ఢమా' మంటూ గుండె లదిరిపోయేటట్టు మారు్రమోగుతున్నాయి; ఆకాశంలో ఎరుపు, తెలుపు, పసుపు, ఆకుపచ్చరంగుల పూలు కనుపండువుగా, వానలా కురుస్తున్నాయి; ఒకమూల 'లంకాదహన' బాణసంచాలు మండి భస్మమౌతున్నాయి. ఆరో జెలాంటిదో కాని, ఉన్నట్టు ఉండి కాఫీక్లబ్బుపాకవైపునుంచి పొగా, మంటలూ బయలుదేరినై; కాఫీక్లబ్బు తగలడిపోతోంది. గాలి అపరిమితంగా వెయ్యడంవల్ల కాఫీక్లబ్బుమంటలు 'సర్కసు' డేరా కాల్చేసినై; సర్కసుడేరానుంచి మంటలు వ్యాపించి యింకేవేవో పాకలమీది కురుకజూస్తున్నాయి! అస్స లెట్టా అంటుకుందో కాఫీక్లబ్బుపాక ? ఎవ్వరికీ తెలీదు! ఏదుండగీ డంటించాడో? ఎక్కడా గందరగోళం! గగ్గోలు! ఇంతట్లోకే విద్యుద్దీపాలొక్కదఫా ఆరినై ! ఎఱ్ఱగా, భయంకరంగా ఆకాశంలోని కుటుకుతూన్న ఆవేడిమంటాలు రక్తప్రభామయంగా మార్చివేసిన వాదిమ్మచీకట్లను ! ప్రాణాలు దక్కించుకునే ఉద్దేశంతో మనుష్యు లటూ యిటూ, అడ్డంగా దిడ్డంగా పరుగులుతీస్తున్నారు.

"పిల్లా! సూరీ! ఓపిల్లా! ఓసూరీ!" అని గద్గదకంఠంతో అరుస్తూ పిచ్చివాడిమల్లె ఈరయ్య ఆత్రొక్కిడిలో బడి అక్కడి కిక్కడికి తోసుకుని సూరమ్మను వెతుకుతున్నాడు. పాపం! సూరమ్మ ఏమయిందో! నాయుడుగా రేరీ?

* * * * *

"బావో! మరీ ?"

"ఎక్కి కూసో! కూసో! కూసో!"

"అమ్మో! బాబో! బావో!"

'బావో' 'బావో' అంటూ గద్గదస్వరంతో రోదిస్తూ భయంచేత వణికిపోతూ, ఏమి చెయ్యడానికి తోచక, ఎల్లాగో అల్లాగా, పాపం, సూరమ్మ జట్కాబం డెక్కి కూర్చుంది.

"ఎంగె సార్ ?"

"మింట్ స్ట్రీట్" అంటూ జట్కావాడికి సమాధానం చెప్పి, అటూ ఇటూ ఓమారు సంశయంతోను భయంతోను గాలించి నాయుడుగారు జట్కా యెక్కి కూర్చున్నాడు. జట్కాబండి కదిలింది!

* * * * *

గగ్గోలుపెడుతూ ఆకాశం ఊడిపడేటట్టు యేడుస్తూ 'చెన్నపట్నం టక్కరీ! లంజకొడకా! ఆగో! ఆగో!' అని గర్జిస్తూ రివ్వున వొచ్చి జట్కా వెనకాలే కూర్చునిఉన్న నాయుడుగారి చెయ్యట్టుకుని గుభీలున క్రిందికి లాగేశాడు ఈరయ్య! నాయుడు మట్టిమీద చతికిలబడ్డాడు; పెద్దగుంపు మూగింది; 'దభీదభీ' చతికిలబడ్డనాయుణ్ణి ఈరయ్య చితకబొడిచాడు; మూగిన జనానికి జరిగినమోసం తెలిసింది. అందరా 'టక్కరి' మీది కెగబడ్డారు. అక్కడే ఉన్న ఒక పోలీసు దొర నాయుడుగారి నిలా సన్మానించారు — "డామ్ రాస్కెల్! అంబుటియ్యా! ఉంబేర్ రా-మా-యా-దానే? బద్మాష్! 'ఫోర్జరీ' పోరవిల్లి యో? పొణ్ణుగూడే వేణూమో? బద్మాష్!"

నేనూ అప్పుడక్కడ ఉండటం తటస్థించడంవల్ల ఏమిటో కథ కనుక్కుందా మనుకున్నా. రామయ్యనాయు డొక పెద్దమోసగాడనీ, భోగంకులస్థుడనీ, యిలా చక్కని అమాయికపుపడుచు పిల్లల నెందరినో మోసం జేసి తీసుకెళ్లి నిర్బంధించి పడుపువృత్తిలోనికి దింపి తద్ద్వారా ధన మార్జించుతున్నాడనీ, ఇదివరకే ఫోర్జరీ చేసి నాలుగైదేళ్లు కఠినశిక్ష ననుభవించాడనిన్నీ అక్కడ గుంపులు గుంపులుగా పోగైనవా ళ్లందరూ చెప్పుకుంటూంటే నేను విన్నా.